ఎస్‌కోటలో ఈదురు గాలులతో భారీ వర్షం

పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, ఫ్లెక్సీలు నేలమట్టం, విద్యుత్ సరఫరాకు ఆటంకం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ఎస్.కోటలో మూడు విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. గురువారం సాయంత్రం 4.15 నుండి 5.10 వరకు ఎస్.కోటలో భారీ వర్షం కురిసింది. భారీ గాలులు కారణంగా ఎస్.కోట దేవీ జంక్షన్లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు నేల కూలాయి. ఈ సమయంలో ప్రధాన రహదారిపై ప్రజల రాకపోకలు లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇక విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు ఏఈ రవి తెలియజేశారు. ఈదురు గాలుల కారణంగా కాసిన మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.

మీ ఓటు....మీ భవిష్యత్తు

అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విశాలాంధ్ర-విజయనగరం: మీరు వేసే ప్రతీ ఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, మయూరి జంక్షన్ వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించి, ఓటు హక్కు వినియోగం పట్ల అవగాహన కల్పించారు. హుషారైన నృత్యాలను ప్రదర్శించిన ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ, ఓటు వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. మన భవిష్యత్తును నిర్ణయించే ఓటును చాలా ఆలోచించి సరైన వ్యక్తికి వేయాలని సూచించారు. కెవైసి యాప్‌లో ప్రతీ అభ్యర్థి వివరాలు ఉన్నాయని, వాటిని సూచి నిర్ణయించుకోవాలని చెప్పారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని, దానిని నిర్ణయించుకొనే శక్తి ఓటుకే ఉందని స్పష్టం చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతీఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని శతశాతం ఓటింగ్‌ను నమోదు చేయాలని కోరారు. 1950 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, అలాగే ఓటుకు సంబంధించిన వివరాలను కూడా తెలుసు కోవచ్చునని సూచించారు. ఎన్నికలు అన్నవి ప్రజాస్వామ్యానికి అతిపెద్ద పండుగ లాంటివని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, ట్రైబల్ యూనివర్సిటీ డీన్ జెపి మిశ్రా, ఏఓ డాక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ, రీసోర్స్ పర్సన్ పద్మనాభం, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంటు స్థానానికి 30, అసెంబ్లీకి 184 నామినేషన్లు

-నేడు నామినేషన్ల స్క్రూటినీ -29న అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన - జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో పార్లమెంటు స్థానానికి 30 సెట్లు, అసెంబ్లీ స్థానాలకు 184 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. పార్లమెంటు స్థానానికి 18 మంది, మొత్తం 7 అసెంబ్లీ స్థానాలకు 105 గురు నామినేషన్లు వేశారని చెప్పారు. వీరి నామినేషన్ పత్రాల పరిశీలన శుక్రవారం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీడియా సెంటర్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ ఆర్‌ఓల సమక్షంలో నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని, ఈ నెల 29 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలు వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను, 29వ తేదీ సాయంత్రం గుర్తులతో సహా ప్రకటించడం జరుగుతుందని వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు రూ. 4.43 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహ పరికరాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. దీనిలో నగదు రూ.1.04 కోట్లు, 14,372 లీటర్ల మద్యం, రూ.29.75 లక్షల విలువైన డ్రగ్స్, రూ.1.85 కోట్ల విలువైన లోహ ఆభరణాలు, రూ.75.13 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు అధికారులతో జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ ప్రతీరోజు ఉదయం 11 గంటలకు సమావేశమై, సీజ్ చేసిన వాటిపై చర్చిస్తుందని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, సర్వైలెన్స్ టీమ్స్, చెక్ పోస్టుల్లో, పోలీసు చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన నగదు, వస్తువులకు సంబంధించి జెడ్‌పి సిఇఓ ఆధ్వర్యంలోని ఈ గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని సూచించారు.

ఒకవైపు తండ్రి మరోవైపు కూతురు, అల్లుడు ప్రచారం

విశాలాంధ్ర -విజయనగరం రూరల్ : నగరంలో వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఓవైపు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తుంటే, మరోవైపు ఆయన కుమార్తె కోలగట్ల శ్రావణి, అల్లుడు ఈశ్వర్ కౌశిక్ వివిధ డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని చేపడుతున్నారు. గురువారం కొత్తపేట ప్రాంతంలో ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ తో కలిసి కోలగట్ల శ్రావణి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 29వ డివిజన్ లో ఈశ్వర్ కౌశిక్ వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఆయా ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంది. ప్రచారంలో పాల్గొన్న నేతలకు స్థానికులు విజయ తిలకాలు దిద్ది హారతులు పట్టారు. పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకు న్నారు. ఈ సందర్భంగా కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేసిన కోలగట్లను మరోసారి శాసనసభ్యులుగా గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో సంక్షేమ అభివృద్ధి పాలన సాగిందన్నారు. ప్రజలకు మరింత మంచి చేకూరాలంటే వైసిపి అభ్యర్థులను గెలిపించుకోవలసిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి ఫీజు చెల్లింపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆర్థికంగా వెనుకబడిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినికి కాలేజీ ఫీజు రూ35 వేలు చెల్లించినట్లు జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూప్' అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ తెలియజేసారు. గురువారం స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణం లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 కి 448 మార్కులు సాధించిన సముద్రాల మధులతకు కాలేజి ఫీజు చెల్లించినట్లు శేఖర్ తెలియజేసారు. ఉల్లి వీది వాసవీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ , వాసవీ క్లబ్ విజయనగరం మరియు గ్రూప్ సభ్యుల సహాయ సహకారాలుతో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ ముఖ్యంగా విద్య, వైద్యం, వివాహం కార్యక్రమాలను గ్రూప్ చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, బి.వి.పి.ఎస్. రామయ్య, కలగర్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జామిలో కాంగ్రెస్ అభ్యర్థి డా.తిరుపతి కు ఘనస్వాగతం

పలు దేవాలయాలలో పూజలు

విశాలాంధ్ర-జామి: ఎస్‌కోట నియోజకవర్గ జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. గేదెల తిరుపతికి జామిలో గురువారం ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఆయన ఎస్‌కోటలో నామినేషన్ వేసేందుకు ముందుగా జామి వచ్చారు. గ్రామంలోని పురాతన శివాలయంలో పూజలు చేసారు. అనంతరం ర్యాలీగా శాఖ వీది వరకు వెళ్ళి అక్కడ శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేసారు. అక్కడనుంచి క్యాడర్‌తో కలిసి గ్రామదేవత శ్రీఎల్లారమ్మ తల్లిని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసారు. తనకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ రాగానే ఈపూజలు చేయాలని నిర్ణయించుకున్నానని, నియోజకవర్గానికి ఈశాన్య దిక్కున శుభంగా భావించి తన నామినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించానని డా. తిరుపతి తెలిపారు. తనకు మద్దతుగా వచ్చిన స్థానిక ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా పలువురు డా. తిరుపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోనిఅప్పారావు, స్థానికులు చుక్క జగన్నాథం, చలుమూరి తిపిరి, సూర్రెడ్డి నాయుడుతోపాటు పలువురు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో ఆలోవీ టెక్నాలజీస్ ప్రాంగణ నియామకాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సీతం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆలోవీ టెక్నాలజీస్ వారిచే ప్రాంగణ నియామకాలు నిర్వహించబడ్డాయి. మొదటగా స్క్రీనింగ్ టెస్ట్ గ్రూప్ డిస్కషన్ మరియు ఇంటర్వ్యూ నిర్వహించేరు. ఇందులో ఇసిఇ, ఇఇఇ, ఎంబిఏ, బిబిఏ వారు పాల్గొన్నారు. ఇందులో 12 మంది విద్యార్థులని ఎంపిక చేసుకున్నట్టు తెలియజేశారు. ప్రక్రియను ఆలోవీ సంస్థ మానవ వనరుల శాఖ అధిపతులు ప్రసాద్, గాయత్రీ నిర్వహించేరు.సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఆలోవీ సంస్థ కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసేరు. ప్రతి సంవత్సరం ఆలోవీ సంస్థ ప్రాంగణ నియామకాలు నిర్వహించాలని వారిని కోరేరు.సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఇ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బంగారు బాటవేసుకోవాలని సూచించారు. ఇ కార్యక్రమాన్ని ప్లేసెమెంట్ ఆఫీసర్స్ & చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇసిఇ అధ్యాపకురాలు వి శిరీష పర్యవేక్షణలో నిర్వహించారు.

జై భీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థి నామినేషన్

విశాలాంధ్ర-గజపతినగరం : జై భీమ్ రావు భారత్ పార్టీ గజపతినగరం నియోజకవర్గ అభ్యర్థిగా పెంట శంకర్రావు నామినేషన్ను గురువారం తాసిల్దార్ కార్యాలయంలో ఎంవి సూర్యకళ కు తన అనుచరులతో ర్యాలీగా వచ్చి నామపత్రాలు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో మార్పునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కంట్రోల్ రూంను సందర్శించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు తలాత్ పర్వేజ్ ఇక్బాల్

విశాలాంధ్ర -విజయనగరం: చీపురుపల్లి, రాజం, బొబ్బిలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ గురువారం ఎన్నికల కంట్రోల్ రూంను, మీడియా కేంద్రాన్ని సందర్శించారు. కంట్రోల్ రూం లో ఏర్పాటుచేసిన వాహనాల జి పి ఎస్, చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సి సి కెమెరాల లైవ్ కార్యక్రమాలను, మీడియా మానిటరింగ్, ఎంసిసి, సి విజిల్, 24/7 ఫిర్యాదుల విభాగం, సోషల్ మీడియా పర్యవేక్షణ , రిపోర్ట్స్ విభాగాలను తనిఖీ చేసారు. అన్ని విభాగాల నుండి చేస్తున్న కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియా సెంటర్ ను సంద ర్శించారు. ఎంసిఎంసి ద్వారా జారీచేస్తున్న అనుమతుల పై ఆరా తీసారు. పెయిడ్ న్యూస్, ప్రకటనలను అభ్యర్థుల ఖాతాల్లో వేయాలని సూచించారు. పరిశీలకుని వెంట డిఆర్‌ఓ అనిత, సి పి ఓ బాలాజీ, డి.ఐ.పి.ఆర్.ఓ రమేష్, కంట్రోల్ రూం అధికారులు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ళ లలితకుమారి ప్రచారం : వెంకటరావు

విశాలాంధ్ర-వేపాడ: శుక్రవారం మండలంలోని మూడు గ్రామాల్లో శృంగవరపుకోట నియోజవర్గ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ళ లలిత కుమారి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 10 గంటల వరకు సోంపురం, అరిగిపాలెం,ఆతవ గ్రామాలలో ఎన్నికల ప్రచారం జరుగుతుందని.ఈ ప్రచారానికి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీ భరత్ పెద్దమ్మ భైరపనేని శ్రీనాగి,రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి కోళ్ల అప్పల బాలాజీ రాంప్రసాద్,రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాణిలు పాల్గొంటారన్నారు.ఈ కార్యక్రమాలకు, మాజీ ఎంపీపీలు, జనసేన, బీజేపీ నాయకులు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్ లు,బూత్,యూనిట్,క్లస్టర్ ఇంచార్జ్ లు,ప్రస్తుత సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్ లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీ సంతకాలు రికార్డుల మీద సంతకాలు తీసుకొని సాదాసీదాగా ముగించడం జరిగింది. కొన్ని గ్రామాల్లో తాగునీరు ఎద్దడిగా ఉన్నప్పటికీ ఈ సమావేశంలో చర్చించకపోవడం తగు చర్యలు సూచించక పోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైసీపికి మద్దతు తెలపండి : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకి మేలు చేస్తున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు.గురువారం పురపాలక సంఘం పరిధిలో గల 16వ వార్డు లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ ఇంట్లో ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి తనను విజయనగరం జిల్లా పార్లమెంట్ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పేదరికాన్నే కొలమానంగా తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందన్నారు.రానున్న ఎన్నికలు పేదరిక నిర్మూలన,పెత్తందారీ వ్యవస్థల మధ్యన జరుగుతున్నాయని,ఎవరి పాలన మేలు చేస్తుందో ప్రజలు గుర్తించాలని అందుకు అనుగుణంగా ఓట్లు వేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ రావు, వాడపల్లి వనజ కుమారి, జే సి ఎస్ కన్వీనర్లు తమ్మి రెడ్డి దామోదర్, రేజేటి విశ్వేశ్వరరావు న్యాయవాది రూంకానా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి రోజున ఐదు నామినేషన్లు సమర్పణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : బహుజన సమాజ్ పార్టీ నుంచి సబ్బి, కాంగ్రెస్ పార్టీ నుంచి జమ్ము, జై భీమారావు భారత్ పార్టీ నుంచి కనిగిరి స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు నామినేషన్లు సమర్పణ చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులుగా నామినేషన్ల చివరి రోజు అయిన ఈరోజు ఐదు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి జమ్ము ఆదినారాయణ, బహుజన సమాజ్ పార్టీ నుంచి సబ్బి సత్యనారాయణ, జై భీమారావు భారత్ పార్టీ నుంచి కనిగిరి శ్రీనివాసరావు స్వతంత్ర అభ్యర్థులుగా తుమ్మగంటి భవాని గరుగుబిల్లి అప్పలనాయుడు లు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు ఆర్వో వి శాంతి తెలిపారు. ...

ఉచిత మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-గజపతినగరం : స్థానిక స్ఫూర్తి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం గజపతినగరం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్వీ ప్రభాకర్‌రావు ఎస్సై యు మహేష్ లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని అన్నారు. అలాగే విపరీతమైన వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని గజపతినగరం కేంద్రంగా పూర్తి వాకర్స్ క్లబ్ సభ్యులు అందరూ కలిసి అన్నార్తులకు బాటసారులకు ప్రయాణికులకు కొన్ని వందల మందికి దాహార్తిని తీర్చడం గొప్ప విషయం అని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం వల్ల మానసిక ఆనందం ఆత్మసంతృప్తి కలుగుతుందని ఇది ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని వాకర్స్ సభ్యులను కొనియాడారు. అనంతరం వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బొంతల కోటి శంకర్రావు మాట్లాడుతూ వేసవి ఎండలు తగ్గేవరకు వర్షాలు కురిసే వరకు మా ద్వారా ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని నిరంతరం ఉదయం 10 గంటల నుండి కొనసాగిస్తామని అన్నారు ఈ కార్యక్రమం ప్రతి ఏడాది ఏప్రిల్ లో ప్రారంభించి జూన్ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు మానాపురం సుధాకర్ ప్రధాన కార్యదర్శి బివి కే శేఖర్ ఆర్గనైజింగ్ సభ్యులు రేగ సురేష్ పొట్ట వీర్రాజు కార్యదర్శి బి దామోదర్ రావు ఉపాధ్యక్షులు తిరుపతిరావు కోశాధికారి ఆరిశెట్టి రవికుమార్, ముఖ్యులు ఆరిశెట్టి రమేష్ అరిసెట్టి తిరుపతిరావు ఎన్ అప్పారావు వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరువు నష్టం కేసు వేస్తా..

విశాలాంధ్ర-గజపతినగరం : రైతులను మోసం చేయడం భూకబ్జాలు చేయడం వంటి పనులు తాను ఎప్పుడు చేయలేదని ఆ అవసరం నాకు లేదని పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ జేఈ బెవెర నాగేశ్వరరావు అన్నారు. గణపతి నగరం లో పర్ణశాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేను గత కొన్నేళ్లుగా తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారని ఇటీవల గజపతినగరంలో మేడిశెట్టి కుటుంబ సభ్యులు వెంకట సత్య నాగకుమారి, శ్రీరామమూర్తి, శేషగిరి, శ్రీనివాసరావు తదితరుల నుండి జిరాయితీ భూమిని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు ఈ భూమిని తాను కబ్జాచేశానని వారి కుటుంబ సభ్యుల్లో మేడిశెట్టి సుబ్బలక్ష్మి బొండపల్లిలో మంగళవారం నిర్వహించిన సభలో టిడిపి అధినేత చంద్రబాబుకు చెప్పడం విడ్డూరం అని అలాగే భూముల్లో ఎమ్మెల్యే అప్పల నరసయ్య హస్తం కూడా ఉందని చెప్పడం దుర్మార్గమన్నారు తనకు ఎమ్మెల్యే అప్పల నరసయ్యకు ఎటువంటి సంబంధం లేదని అనవసరంగా ఆయనపై నిందలు వేయడం సబబు కాదన్నారు తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గేదెల తిరుపతి
- ఇండియా కూటమి నాయకులతో కలిసి నామినేషన్

దాఖలు చేసిన గేదెల తిరుపతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఇందిరమ్మ రాజ్యం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ద్వారానే సాధ్యమని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ద్వారానే వస్తుందని ఎస్‌కోట నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గేదెల తిరుపతి అన్నారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలైన సిపిఐ, సిపిఎం, ఆమ్‌ఆద్మీ నాయకులతో కలిసి వెళ్లి ఎస్.కోట తహశీల్దార్ కార్యాల యంలో రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ వద్ద గేదెల తిరుపతి నామినేషన్ పత్రా లను గురువారం దాఖలుచేశారు. ముందుగా ఇండియా కూటమి నాయకులు, కార్య కర్తల తో కలిసి బ్రాహ్మణ వీధిలోని కోదండ రామాలయం నుండి ర్యాలీగా వెళ్లి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మెయిన్ రోడ్డు, పంచాయతీ కార్యాలయం రోడ్డు, జీసీసీ రోడ్డు మీదుగా దేవీ జంక్షన్ వరకు ఇండియా కూటమి నాయకులతో ర్యాలీ నిర్వహించారు. వినాయక ఆలయం, దేవీ ఆలయాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గేదెల తిరుపతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి ఇందిరమ్మ అని, ఆ ఇందిరమ్మ రాజ్యస్థాపనకు మహానేత వైఎస్ రాజ శేఖరరెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు రాజశేఖరరెడ్డి కలలు గన్న ఆ ఇందిరమ్మ రాజ్యం మళ్ళీ అయన తనయ వైఎస్ షర్మిల వల్లే సాధ్యమన్నారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు రామ రాజ్యాన్ని చూసారని అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ ద్వారా పేద విద్యార్థులు డాక్టర్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను చదువుకునే అవకాశం కల్పించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా పేదలను ఆదుకున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, మళ్ళీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నామినేషన్ వేయడంతో తన బాధ్యత మరింత పెరిగిందని, ఇక నిత్యం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ పార్టీ సుపరి పాలనను వారికి గుర్తు చేస్తామన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశానికి ఇండియా కూటమి అధికారంలోకి రావడం అత్యవసరమని ప్రజలు గుర్తించి హస్తం గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని గేదెల తిరుపతి విజ్ఞప్తి చేశారు. అనంతరం సిపిఐ నాయకులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో బిజెపి అరాచక శక్తులను ఎదుర్కోవాలంటే ఇండియా కూటమితోనే సాధ్యమన్నారు. దేశ అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. భారతీయ జనతా పార్టీ చేస్తున్న అరాచకాలను ప్రజలంతా చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పదాల మణిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వంపై రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలంతా విసుగు చెందారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సీపీఐ, సిపిఎం నాయకులు దేగల అప్పలరాజు, కండిపల్లి భీముడు, ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్.సన్యాసిరావు, జి.సత్యారావు మాట్లాడుతూ బిజెపి మతతత్వ శక్తులను ఎదుర్కోవాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు.

మోపాడలో వైసిపి ఎన్నికల ప్రచారంలో బద్దుకొండ మణిదీప్

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ మండలం మోపాడు పంచాయతీలో నెల్లిమర్ల నియోజకవర్గ యువజన నాయకులు బద్దు కొండ మణిదీప్ వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు బంటుపల్లి వాసుదేవరావు గ్రామ సర్పంచి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బద్దుకొండ అప్పలనాయుడు ఎంపీ బెల్లాన చంద్రశేఖర రావుని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కొనగాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బద్దుకొండ అప్పలనాయుడు కోరారు. నెల్లిమర్ల మండలం ఒమ్మిలో ఎమ్మెల్సీ సురేష్ బాబుతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దుకొండ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మన పిల్లలు భవిష్యత్ కోసం వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బద్దుకొండ అప్పలనాయుడు కోరారు. నెల్లిమర్ల మండలం ఒమ్మిలో ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసి నాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రచారాలతో మారుమ్రోగుతున్న పల్లెలు

విశాలాంధ్ర -రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇరు పార్టీల నాయకుల ప్రచార రథాలు పల్లెల్లో తిరుగుతూ మైకులతో హోరెత్తిస్తున్నాయి. ఒక వీధిలో వైకాపా ఆటోలు తిరిగితే, మరొక వీధుల తెలుగుదేశం పార్టీ ఆటోలు ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నాయి. నేటితో నామినేషన్ గడువు మీడియం తో అభ్యర్థులు గ్రామాలలో ముమ్మరంగా నాయకులు కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రచారాలు చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై వీధి లైట్లు వెలగక అవస్థలు

విశాలాంధ్ర-రాజాం: రాజాం ప్రధాన రహదారిపై ఉన్న సెంటర్ స్ట్రీట్ లైటింగ్ గత కొద్ది రోజులుగా వెలగటంలేదు. రోడ్డుకు రెండు వైపులా వెలగాల్సిన లైట్లు వెలగకపోవడంతో మెయిన్ రోడ్డు అంధకారంగా తయారవుతుంది. రోడ్డుపక్కన ఉన్న షాపులు సుమారు రాత్రి 9 గంటల సమయంలో మూసివేయడంతో రోడ్డుపై లైటింగ్ లేక రోడ్డుపై నడిచి వెళ్లే వారు ఈ చీకట్లో ఏ వాహనాలు వచ్చి మమ్మల్ని ఢీకొంటాయోనని భయపడుతున్నారు. రోడ్డుపై పశువులు తిష్టవేస్తుండటంతో చీకట్లో అవి కనబడక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో పశువులను గుర్తు తెలియని వాహనాలు ఢీకొని వెళ్లిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. గత రెండు నెలల క్రితం కొత్తగా బదిలీపై వచ్చిన కమిషనర్ జె.రామ అప్పలనాయుడు సెంట్రల్ లైటింగ్ పై దృష్టి పెట్టి లైట్లు వెలిగేటట్లు చేయించినా మళ్లీ కొద్దిరోజుల్లో మళ్లీ యధా స్థితికి వచ్చాయి. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా పర్మినెంట్ గా పనులు చేయాలని, ఈ రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్‌లో ఉండే లైట్లు రెండు పక్కలా అన్ని లైట్లు వెలిగేటట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షేమ అభివృద్ధికి సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబు ని సీఎం చేయండి

ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: మే 13న జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటీలో గల మల్లంపేటకు చెందిన 23,24,25 వ వార్డులకి సంబంధించి మల్లంపేటలో రెండోరోజు గురువారం తెలుగుదేశం-జనసేన-బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) గడప గడపకి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ప్రచారం చేస్తూ,ప్రజలతో మమేకం అయ్యి వారి మద్దతు కోరారు. నియోజకవర్గ సంక్షేమ అభివృద్ధి కోసం సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో జనసేన బిజెపి టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన ఎన్నికల ప్రచారంలో ఓటర్ల నుండి విశేష స్పందన లభించింది. అడుగడుగునా మహిళలు నుదుటన కుంకుమ బొట్టు పెట్టి ఆహ్వానం పలికారు. ఈ ప్రచార కార్యక్రమంలో బేబినాయన తో పాటుగా నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ గిరడ.అప్పలస్వామి ,జనసేన పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి బాబు.పాలూరు ,3వార్డులకి సంబంధించిన పెద్దలు కౌన్సిలర్ .కళ్యంపూడి లక్ష్మి ,కౌన్సిలర్ ప్రతినిధి కళ్యంపూడి.సత్యనారాయణ ,పోల.జనార్ధన ,మాజీ కౌన్సిలర్ పోల.గోపాలకృష్ణ ,పోల.పెద్ద వెంకటరమణ ,తెంటు.రమేష్ ,పోల.వసంత ,తెంటు.సీతారామ మూర్తి ,కర్రి.మోహన్ ,బలగ.చిన్ని ,పోల.ప్రవీణ్ ,పట్టణ అధ్యక్షులు రాంబార్కి.శరత్ బాబు ,మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల.శ్రీనివాసరావు ,పట్టణ ఫ్లోర్ లీడర్ గెంబలి.శ్రీనివాసరావు ,విజయనగరం పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి.సాయిరమేష్ , పట్టణ మహిళా అధ్యక్షురాలు బర్లి.శ్రీదేవి , విజయనగరం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు వెలగాడ.హైమావతి ,జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సంచాన.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు ఎంపి స్థానానికి 5, అసెంబ్లీకి 41 నామినేషన్లు

విశాలాంధ్ర-విజయనగరం : నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. చివరిరోజు గురువారం ఎంపి స్థానానికి 5, అసెంబ్లీ స్థానాలకు 41 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయనగరం పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, టిడిపి అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు, స్వతంత్ర అభ్యర్థిగా అల్లు శ్రీరాములు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా ఇప్పిలి అప్పలనాయుడు, స్వతంత్ర అభ్యర్థిగా తాడ్డి ఆదినారాయణ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను, పార్లమెంటు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి మొత్తం 38 మంది 41 నామినేషన్ల సెట్లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

వైకాపా నుండి పలు కుటుంబాలు టిడిపిలో చేరిక

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోనికి గురువారం అశోక్ బంగ్లాలో 26వ డివిజన్ వైకాపా కు చెందిన యర్రంశెట్టి రమణ, పి.సూర్యనారాయణ, వై. శ్రీనివాస్, పి. రాము, అయ్యప్పతో పాటు పలు కుటుంబాలు వారు మరియు 27వ డివిజన్ వైకాపా కు (జొన్నగుడ్డి రెల్లి వీధి) చెందిన బంగారపు దుర్గారావు, వై. భాస్కర్, బి. విశ్వనాథం, వై. ఈశ్వరరావు, వై. చంద్రశేఖర్, పవన్ కుమార్ తో పాటు పలు కుటుంబాలు వైసీపీ అసమర్ధ పాలన మీద నమ్మకం లేక రాష్ట్ర మరియు విజయనగరం నియోజకవర్గం అభివృద్ధి నారా చంద్రబాబు నాయుడు తోనే జరుగుతుందన్న నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగినది. వారందరికీ తేదేపా జనసేన బిజెపి కూటమి విజయనగరం శాసనసభ అభ్యర్థిని పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పార్టీ కండువా తో తెలుగుదేశం పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నారాయణ కళాశాల విద్యార్థుల హవా

ఎం రిషి వర్ధన్

డి. మాధవరావు

ఎం. భానుప్రకాష్

యు.ఆర్యవర్ధన్‌నాయుడు

డి.రేవంత్ ఈశ్వర్

పి.రేవంత్ సాయి

అల్లు హేమంత్

బి.భరత్ కుమార్

పి.సృజన్ నారాయణ

బి. మనోజ్‌కుమార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నారాయణ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు ఉత్తరాంధ్ర డీన్, డీజీఎం డి హనుమంతరావు, విజయనగరం జిల్లా ఏజీఎం ఆర్ విశ్వేశ్వరరావు తెలిపారు. విజయనగరం పట్టణం చెందిన విశాఖపట్నం నారాయణ వసతి గృహంలో ఉంటున్న ఎం రిషి వర్ధన్ క్యాటగిరి ర్యాంక్ 12, ఓపెన్ కేటగిరి 69, ఏ హేమంత్ కేటగిరీ ర్యాంక్ 38, ఓపెన్ క్యాటగిరి ర్యాంక్ 277, పి సృజన నారాయణ కేటగిరి ర్యాంక్ 105, ఓపెన్ కేటగిరి 649, ఎం భాను ప్రకాష్ కేటగిరి 132, ఓపెన్ కేటగిరి 820, యు ఏ వి నాయుడు క్యాటగిరి రాంక్ 233, ఓపెన్ క్యాటగిరి 1303, డి రేవంత్ ఈశ్వర్ క్యాటగిరి ర్యాంక్ 26, ఓపెన్ కేటగిరి 1414, బి మనోజ్ కుమార్ క్యాటగిరి ర్యాంక్ 258 ఓపెన్ కేటగిరి 1459, బి భరత్ కుమార్ కేటగిరి ర్యాంక్ 28, ఓపెన్ కేటగిరీ 16 23 పి రేవంత్ సాయి క్యాటగిరి ర్యాంక్, 390 ఓపెన్ కేటగిరి 21 80 వీరితో పాటు మరొక 15 మంది 10 వేలు లోపు ర్యాంకులు సాధించారు ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర డీన్, డిజిఎం డి హనుమంతరావు, జిల్లా ఏజీఎం ఆర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే నారాయణ కళాశాల విద్యార్థులు ఎన్నో విజయాలను సాధించుకుంటూ వస్తున్నారన్నారు. నారాయణ కళాశాలలో చదివి ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని నారాయణ కళాశాలలో ఉన్నత విజయాలు సాధించేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉన్నామన్నారు. ఇంతటి విజయాలు అందించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

సమ సమాజ స్థాపనకు మలేరియా నివారిద్దాం

జిల్లా మలేరియా అధికారిణి మణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మలేరియా నిర్మూలన కోసం పోరాటాన్ని వేగవంతం చేయాల్సిన ఆవశ ఎంతైనా వుందని, తద్వారా సమ సమాజ స్థాపన సాధ్యమని జిల్లా మలేరియా నివారణ అధికారిణి వై.మణి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఇక్కడి ప్రెస్ క్లబ్ జంక్షన్లో స్థానికులతో ఆమె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మణి మాట్లాడుతూ వారానికోసారి డ్రై డే పాటించడం ద్వారా దోమలు పుట్టుకను అరికట్టవచ్చని చెప్పారు. ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం ద్వారా ప్లాస్మోడియం అనే పరాన్నజీవులు మనిషి రక్తంలోకి ప్రవేశించడం ద్వారా మలేరియా సోకుతుందని చెప్పారు. చిన్నపిల్లలు ఎక్కువగా మలేరియా బారిన పడుతుంటారని, సకాలంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకం అని చెప్పారు. దోమతెరలు వాడడం వలన దోమకాటును నివారించవచ్చునని, చుట్టూ నివాస ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ శిరీష, సబ్ యూనిట్ అర్బన్ అధికారి సురేష్, ఫైలేరియా ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. అంతకుముందు ఘోష ఆస్పత్రి నుండి అంబటి సత్రం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మలేరియాపై, నివారణ చర్యలుపై అవగాహన కల్పించారు. ఫైలేరియా యూనిట్ హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవు

బహిరంగ సభలో చంద్రబాబు, పవన్

విశాలాంధ్ర-డెంకాడ: ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్క కూడదని ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని సింగవరం వద్ద నిర్వహించిన వారాహి విజయభేరి సభలో పాల్గొని వారు ఓటర్లను ను ఉద్దేశించి వారు ప్రసంగించారు ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కకుండా చేలని రాష్ట్రాన్ని ఈ ఐదు సంవత్సరాల అధోగతి పాలు చేసిన పార్టీ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కమని స్పష్టం చేశారు పులివెందులలో కూడా జగన్ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కని జగన్ కు చంద్రబాబు సవాల్ విసిరారు జగన్మోహన్ రెడ్డి ఎక్కడ సభలు పెట్టిన ఒక మనిషికి 500 బిర్యానీ పంచిన జనం రావట్లేదని ఎద్దేవా చేశారు నెల్లిమర్ సభకు జన సునామీ వచ్చారని తాము అధికారులకు వస్తే నెల్లిమర్ల దశ దిశ మారుస్తామని హామీ ఇచ్చారు ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి మాట్లాడుతూ బడ్డుకొండ అప్పలనాయుడు నాలుగు మండలంలోని కొండలను చెరువులను మింగేస్తున్నారని ఆరోపించారు వైసిపి ప్రభుత్వం నవరాత్రాల పేరిట ప్రజలను నయవంచన చేస్తుందని ఇప్పటికే రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాష్ట్రం గతం ఐదేళ్లుగా బాగా వెనుకబడిందని కూటమి అభ్యర్థులను అధికారులకు వచ్చిన తర్వాత ఐదు సంవత్సరాలు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు ఎంపీ అభ్యర్థి కలిసేటి అప్పల నాయుడు మాట్లాడుతూ తనకు సీటు కేటాయించినందుకు కూటమికి ధన్యవాదాలు తెలిపారు కూటమి నాయకులకు పదవులు ముఖ్యం కాదని రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తనకు ఒక అవకాశం ఇస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో నాలుగు మండలములో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు, కార్యకర్తలు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో డి.గడబవలస గ్రామానికి చెందిన శ్రీ సత్య సాయిబాబా భజన మండల టీం ప్రతి గురువారం వేసవికాలం ను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారిపై గడబవలస జంక్షన్ వద్ద మజ్జిక పంపిణీ కార్యక్రమం నిర్వహించి ప్రజలు దాహం ను తీరుస్తున్న శ్రీ సత్య సాయి భక్తులు.

ముగిసిన నామినేషన్ల పర్వం చీపురుపల్లి నియోజకవర్గం నుండి 13 నామినేషన్లు

విశాలాంధ్ర-చీపురుపల్లి : రాష్ట్రంలో మే 13వ తేదీ జరగనున్న అసెంబ్లీ పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు ఘట్టం నేటితో ప్రశాంతంగా ముగిసినది. చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుండి జాతీయ ప్రాంతీయ, గుర్తింపు పొందిన గుర్తింపు పొందని, స్వతంత్ర అభ్యర్థులుగా 13 మంది తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని ఆర్ వో బి శాంతి తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బొత్స సత్యనారాయణ, బొత్స సందీప్, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా కిమిడి కళా వెంకట్రావు కిమిడి వెంకట రామ్ మల్లిక్, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా తుమ్మగంటి సూరి నాయుడు జమ్మూ ఆదినారాయణ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సభ్య సత్యనారాయణ జై భీమారావు భారత్ పార్టీ అభ్యర్థిగా కనిగిరి శ్రీనివాసరావు బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా అర్జీ శివప్రసాద్, రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా అదపాక సూరిబాబు స్వతంత్ర అభ్యర్థులుగా గుడివాడ షణ్ముఖరావు తుమ్మగంటి భవాని గరుగుబిల్లి అప్పలనాయుడులు తమ నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో శాంతి తెలిపారు.

సమస్యలపై సాంకేతిక పరిష్కారం చూపడం స్మార్ట్ ఆప్ ల ప్రేరణ

అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎంటర్ ఫైనియర్ డెవలప్మెంట్ సెల్ మరియు ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెల్ సంయుక్తంగా నిర్వహించారు ఈ కార్యక్రమం ముఖ్య వక్త గా చంద్రమౌళి అసిస్టెంట్ మేనేజర్ టెక్నాలజీ ట్రాన్స్ఫర్ ఆఫీసర్ గీత యూనివర్సిటీ టెక్నాలజీ సెంటర్ వారు పాల్గొని విద్యార్థులకు స్టార్ ఆఫ్ లపై అవగాహన కల్పించారు ప్రతి పని సమస్యని గమనించి సాంకేతిక అనుసంధానం ద్వారా నూతన పరిష్కారం మార్గాలను కనుగొనటం స్టార్ ఆపులకు ముఖ్య విజయ సూత్రం అన్నారు జాతీయ అంతర్జాతీయ అంకురాలను పరిశీలించి విశ్లేషించి మెలకువలను సాధించాలని సూచించారు విద్యార్థులు వారు నేర్చుకున్న సాంకేతిక విద్యలో మెళుకువలను ఉద్యోగాల లేదా వ్యాపార విలువలు చట్టాలను గూర్చి అంకుర సంస్థకు ఎదురయ్యే సాధారణ సమస్యలను ఎలా అధిగమించవచ్చో మెలకువలను అందించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట అసెంబ్లీ నియోజకవర్గంలో 16 నామినేషన్లు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తంగా 16నామినేషన్లు దాఖలయాయని రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ గురువారం సాయంత్రం వెల్లడించారు. వైఎస్సార్సీపీ నుంచి స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, బోదల అప్పలనాయుడు, బోను కృష్ణ (బీఎస్పీ), కోళ్ల లలితకుమారి (తెలుగుదేశం), గేదెల తిరుపతి (కాంగ్రెస్), విన్నకోట జగన్నాథరావు (సమాజ్ వాదీ), యాళ్ళ వెంకటరావు (జాతీయ జనసేన పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా గొంప సత్యవతి, లోకాభి రామకోటి కొట్యాడ, వారాది చిరంజీవి, రమాదేవి కొట్యాడ, భాస్కరభట్ల పుష్పలత, చిప్పాడ శేషగిరిరావు, వబ్బిన సతీష్, గొల్ల ఈశ్వరరావు, పిడిది ఈస్వరమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. ఇక నామినేషన్ల స్క్రూటినీ అనంతరం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ వంటివి జరగాల్సి ఉంది. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ పడే స్వతంత్రులకు గుర్తులను కేటాయింపు చేస్తామని రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ వివరించారు.

టీడీపీకి అధికారం ఇవ్వాలి : కళా వెంకటరావు



విశాలాంధ్ర-గరివిడి: తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి నారా చంద్ర బాబుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అప్పుడే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చీపురుపల్లి నియోజకవర్గం ఎన్డీఏ అభ్యర్థి కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు కొండ లక్ష్మీపురం, గెద్దవలస, తాటిగూడ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉదయం ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం తాటి కూడా గ్రామంలో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకట రావు, రామ మల్లిక్ నాయుడు, కేటీఆర్, మాజీ ఎంపీపీ పైలు బలరాం, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సారేపాక సురేష్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బలగం వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-జామి: మండలంలోని అట్టాడ గ్రామ సచివాలయంలో వెటర్నరీ శాఖలో ఏహెచ్ఏగా పనిచేస్తున్న దండి నాగరాజు అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. మండలంలోని రామభద్రపురం పంచాయతీ పరిధిలోని కిర్ల కాలనీకి చెందిన నాగరాజుకు ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. రెండు క్రితం ఇంటివద్ద తన బైకును, ఫోన్‌ను వదిలి వెళ్ళిపోయాడు. కుటుంబసభ్యులు అతని ఆచూకీ కోసం ప్రయత్నించారు. గురువారం ఉదయం విశాఖ-రాయపూర్ జాతీయ రహదారిలో అలమండ వద్ద రహదారి పక్కన మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమందించారు. అనంతరం కుటుంబసభ్యులకు తెలియడంతో వారు మృతదేహాన్ని గుర్తించారు. నాగరాజు ఆత్మహత్య చేసుకున్నాడా. లేక హత్య కాబడ్డాడా అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

మలేరియా పై అవగాహన ర్యాలీ

బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారిని ఎల్ రమాదేవి

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక వైద్య ఆరోగ్యంద్రం పరిధిలో మలేరియా జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం ప్రపంచ మలేరి యా దినోత్సవం పురస్కరించుకొని పిహెచ్సి వైద్యాధి కారిణులు ఎల్. రమాదేవి శ్రీవాణిల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి మలేరియా జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని బ్యానర్, ప్లకార్డులతో వీధుల్లో తిరిగారు. అలాగే మలేరియా వ్యాధికి గురైన వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు సూపర్వైజర్లు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులుగా హనిష్ చాబ్ర

గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాల ఫిర్యాదులకు 9550224904ను సంప్రదించాలి

విశాలాంధ్ర-విజయనగరం: గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాల పరిశీలనకు ఎన్నికల పరిశీలకులుగా హనిష్ చాబ్ర కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం నుండి 9550224904 ఫోన్ నెంబర్ నందు అందుబాటు లో ఉంటారని ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం కోసం, ఎన్నికల కు సంబంధించి పోటీలో నున్న భ్యర్థుల ఎన్నికల కోడ్ ఉల్లంఘన, నగదు, మద్యం పంపిణీ తదితర అంశాల పై ఫిర్యాదులను తగు ఆధారాలతో, ఫోటోగ్రాఫ్, లేదా వీడియో, వాయిస్ మెసేజ్ ద్వారా ఫిర్యాదు దారు కాంటాక్ట్ నెంబర్, అడ్రస్ తో సహా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సాధారణ పరిశీలకులు కలెక్టర్ కార్యాలయం లో ఉదయం 10.30 నుండి 11.30 వరకు అధికారికంగా ప్రజలను కలిసేందుకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ముగిసిన నామినేషన్లు ఘట్టం

నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి 16 మంది నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నామినేషన్లు గట్టం గురువారం సాయంత్రం 3 గంటలతో ముగిసింది. నెల్లిమర్ల అసెంబ్లీ నియోజక వర్గానికి మొత్తం 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ పార్టీ అభ్యర్థులు ముగ్గురు, రాష్ట్ర పార్టీలు తరపున ఇద్దరు, గుర్తింపు లేని పార్టీలు తరుపున 8 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి గురువారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున సరగడ రమేష్ కుమార్ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఆయన సతీమణి సరగడ లక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. లెంక మాధవి, మజ్జి నాగమణి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా ఈఆర్ఓ నూకరాజుకి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఎన్ డిఎ కూటమితోనే యువతకి ఉద్యోగాల కల్పన

విశాలాంధ్ర-నెల్లిమర్ల : నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు, ఉపాధి కావాలంటే ఎన్ డిఎ కూటమిని గెలిపించాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి కోరారు. నెల్లిమర్ల మండలం బొప్పడాం, జోగిరాజుపేట, మధుపాడ, జోగిరాజుపేట గ్రామాలలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకం మాధవి మాట్లాడుతూ ఎన్ డిఎ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. అలాగే స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువత, మహిళలని భాగస్వామ్యం చేసి ఆర్థికంగా బలపడేలా చేస్తామని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన రామతీర్థసాగర్ ప్రాజెక్టుని పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందిస్తామని చెప్పారు. రైతన్నలకి సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, నాయకులు గేదెల రాజారావు, పతివాడ అప్పలనారాయణ పాల్గొన్నారు.

నరసాపురంలో బేబీ నాయన ప్రచారం

విశాలాంధ్ర-రామభద్రపురం : బొబ్బిలి తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి బేబీ నాయన గురువారం నరసాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారెంటీయులపై ప్రజలకు వివరించారు. ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. మహిళలకు ఆరు గ్యారెంటీలు కరపత్రాలు చూపిస్తూ ముమ్మరంగా ప్రచారం చేశారు. అలాగే ఆరికి తోటలో కూడా చేశారు ఇంటింటికి వెళ్లి మహిళలతో గతంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చేశారో మీ అందరికీ తెలిసిన, ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటు వసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని కోరారు. ఈయన వెంట రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు తిరుపతి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

కుమార్తె, అల్లుడితో కలిసి 46వ డివిజన్ కణపాక లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రచారం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలోని 46వ డివిజన్ కణపాక ప్రాంతంలో జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఆయన పెద్ద కుమార్తె, అల్లుడి డాక్టర్ సంధ్య, డాక్టర్ నాగాభిషేక్ తో కలిసి పాల్గొన్నారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానికులు వైసీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయ తిలకాలు దిద్ది హారతులు ఇచ్చారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఏ ప్రాంతానికి వెళ్లినా కోలగట్ల వీరభద్ర స్వామికి ప్రజల బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఐదేళ్లపాటు ఆయన ప్రజలకు అందించిన ఉత్తమ సేవలు మౌలిక సదుపాయాల కల్పన పట్ల ఆదరణ చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలన అవినీతి రహిత పాలన పట్ల ప్రజలు తమ అభిమానాన్ని చాటుతున్నారన్నారు. ఎన్నికలలో కోలగట్ల గెలుపునకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రజలు తెలుపుతు న్నారన్నారు. మరోసారి ఆయనను శాసనసభ్యులుగా గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతా రనడవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని అన్నారు. స్థానిక కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ మాట్లాడుతూ తమ డివిజన్ అభివృద్ధికి కోలగట్ల వీరభద్ర స్వామి ఎంతగానో కృషి చేశారన్నారు. ఎన్నో ఏళ్ల నాటి సమస్యలను పరిష్కరిం చారన్నారు. రెండున్నర కోట్ల రూపాయ లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. దీంతో ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మే 13వ తేదీన జరగనున్న ఎన్నికలలో వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ను గెలిపిస్తామని మాట ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దూరు లక్ష్మణరావు, దొంతల శ్రీను, పతివాడ నారాయ ణరావు, తవుడు, కే. రవి, తారకేశ్వరరావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

పైసలు అందక నాయకులు, కార్యకర్తలు గగ్గోలు

జన సమీకరణకి కార్యకర్తలకు వదులుతున్న చేతి చమురు

విశాలాంధ్ర-భోగాపురం: ఎన్నికలలో పోటీపడుతున్న అభ్యర్థుల నుంచి పైసలు అందక పార్టీల నాయకులకు, కార్యకర్తలు గగ్గోలు పెడుతున్నారు. అభ్యర్థుల నామినేషన్‌లకు, ఆయా పార్టీల అధినాయకుల వచ్చేటప్పుడు నిర్వహించే సమావేశాలకు పెద్ద ఎత్తున జనాల్ని చేసుకువచ్చే బాధ్యత గ్రామాలలో ఉన్న కార్యకర్తలదే. కార్యకర్తలు తీసుకువచ్చే జనాలకు డబ్బులు, మద్యం, భోజనాలు ఇవన్నీ తీసుకువచ్చిన కార్యకర్తలు చూసుకోవాలి. వీటన్నిటికీ అభ్యర్థులు కార్యకర్తలకు డబ్బులు ఇస్తారు. కానీ వారిచ్చే డబ్బులు ఎటూ చాలడం లేదని కార్యకర్తలు మల్ల గుల్లాలు పడుతున్నారు. తీసుకువచ్చిన జనాలకు అడిగినవన్నీ సమకూర్చకపోతే గ్రామలలో పట్టుపోతుందని కార్యకర్తలు తమ చేతి డబ్బులు ఖర్చుచేస్తున్నామని అంటున్నారు. ఇలాగైతే కష్టమని కార్యకర్తలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ముందుగా ఖర్చులకు అభ్యర్థులు డబ్బులు ఇవ్వటం లేదని, తాము డబ్బులు ఖర్చు పెట్టిన తరువాత ఎందుకంత ఖర్చు అని తిరిగి తమను ప్రశ్నిస్తున్నారని కార్యకర్తలు అంటున్నారు. కూటమి, వైసిపిల కార్యకర్తలు అంతా దాదాపుగా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎన్నికలలో ఖర్చు కోట్ల రూపాయలు దాటుతుండడం వల్ల అభ్యర్థులు కూడా ఆచితూచి ఖర్చుచేస్తున్నారని కార్యకర్తలు అంటున్నారు. వైసిపి కార్యకర్తలు ఒకడుగు ముందుకు వేసి గత ఐదేళ్ళ మాకు అధికారం ఉన్న ఏమి సంపాదించుకోలేకపోయామని, చేసిన పనులకు బిల్లులు అందక చితికిపో యామని, ఇప్పుడు ఎన్నికల ఖర్చు మూలిగిన నక్కపై తాటిపండు పడ్డట్టు ఉందని అంటున్నారు. పూర్వం కావాల్సినంత డబ్బులు ముట్టజెప్పేవారని తమకు అప్పగించిన పనిని సమర్ధవంతంగా చేసేవారమని అలాగే ఖర్చులు పోను డబ్బులు మిగిలేవని సీనియర్ కార్యకర్తలు అంటున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే మమల్ని ఇబ్బంది పెడితే రానున్న ఎన్నికలలో నెగ్గుకురావడం కష్టమేనని కార్యకర్తలు అంటున్నారు.

ఆదాయం లేకున్నా సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-వేపాడ : రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఏర్పడడంతో రాష్ట్రంలో ఒక్క రూపాయి ఆదాయం లేక ఉన్న సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేనిని శృంగవరపుకో ట ఎమ్మెల్యే కడిబండి శ్రీనివాసరావు అన్నారు.మండలంలోని సోంపురం అరిగిపాలెం జగ్గయ్యపేట ఆకుల సీతంపేట, ఆతవ గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎన్నికల ముందు పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అందించడం జరిగిందన్నారు.అలాగే మహిళలకు డ్వాక్రా రుణమాఫీ, అమ్మ ఒడి పథకం, వైయస్సార్ ఆసరా చేయూత వంటి అనేక పథకాలు అందించాలని, రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అందించాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా జిల్లా మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ బొత్స ఝాన్సీ గారు పోటీ చేయడం మన నియోజకవర్గ అదృష్టంగా భావించాలని ఆమెను ఎమ్మెల్యేగా నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే నియోజకవర్గ మరింత అభివృద్ధి చేసుకోగలమని అన్నారు. అలాగే నాడు ఈ గ్రామాల్లో పర్యటించినప్పుడు ఉన్న సమస్యలు మరల అధికారంలోకి రాగానే మొత్తం తీర్చుకుందామని ప్రతి ఒకరు ఈ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు జడ్పిటిసి సేనాపతి అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎం జగ్గు బాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మార్కెటింగ్ చైర్మన్ మూకల కస్తూరి, కోపరేటివ్ అధ్యక్షులు వి. రామ్మూర్తి నాయుడు,ఎంపీటీసీలు ఆకుల సత్యనారాయణ,తొండవరపు వెంకటరమణ, ఆయా గ్రామాల సర్పంచులు, మురిపిండి గంగరాజు, దుల్ల లక్ష్మి, వంటాకు రాములమ్మ, సుంకరి రమణమ్మ, గొంప వేమన రాము, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరు మృతి

మరొకరి పరిస్థితి విషమం - 12 మందికి గాయాలు

విశాలాంధ్ర-వంగర: మండలంలో పటువర్ధనం గ్రామ శివారున పెళ్లి ట్రాక్టర్ అదుపుతప్పిబోల్తా పడిన దారుణ సంఘటనలో ట్రాక్టర్ లోఉన్న ఒకామె ట్రాక్టర్ తొట్టికింద పడి అక్కడ,కక్కడే మృతి చెందగా, మరొకామే పరిస్థితి కొనఊపిరుతో విషమంగా ఉంది.అంతేకాకుండా ట్రాక్టర్ లో ఉన్నటువంటి మరో 12 మంది కి తీవ్ర గాయాలు పాలయ్యారు. చావు బతుకులమధ్య కొట్టుమిట్టాడు తూ కొన ఊపిరితో ఉన్న లక్ష్మీ ను,గాయాలు పాలైన వారిని పటువర్ధనం గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని 108లో రాజాం హాస్పటల్ కు తరలించారు. ఈ మేరకు స్థానిక ఏస్.ఐ జనార్ధనరావు తెలిపారు.గురువారంనాడు మన్యం జిల్లా బలిజీపేట మండలం పెదపెంకి గ్రామం నుంచి పటు వర్ధనం గ్రామంనకు పెండ్లి కని వచ్చి తిరుగు ప్రయాణంలోఈ దారుణ సంఘ టన జరిగింది. ఇందులో ముఖ్యంగా పెండికుమార్తె నాన్నమ్మ సత్తెమ్మ మరణించగా, తతిమా ట్రాక్టర్ తో పెండ్లికొచ్చిన వారితో ఈ దారుణ సంఘ టన జరిగింది. దీనిపై కేసు నమోదుచేసినట్లు ఏస్ఐ చెప్పారు. మరణించిన సత్తెమ్మ ను పోస్టు మార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వ హాస్పటల్ కు తరలించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ఎం.ఈశ్వర్ అక్షయ్

పిఎస్ఎస్ రాజు

ఎస్. రోషిణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: దేశవ్యాప్తంగా ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు కళాశాలల జోనల్ ప్రిన్సిపల్ కె శ్రీధర్, జోనల్ ఏవో కే మధుసూదన్ రావు, ప్రిన్సిపల్ శ్రీధర్, సురేష్ , రాంబాబు తెలియజేశారు కళాశాలల బ్రాంచ్ నుండి 35 మంది విద్యార్థులు అర్హత సాధించడం జరిగిందని తెలిపారు వీరిలో బి సందీప్ శంకర్ 99.74%, ఎస్ రోషిని 98. 75%, పి వి ఎస్ ఏ రాజు 98.23% ,ఎస్ ఎస్ ఈశ్వర అక్షయ్ 96.51, జి ఎస్ ఆర్ శ్రీవత్స 96.00, పివిజి దీక్షిత 95.73, ఎస్ కిరణ్ కుమార్ 95.61 వీరితోపాటు మరి కొంతమంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జోనల్ ప్రిన్సిపల్ కె శ్రీధర్ జోనల్ ఏ మధుసూదన్ రావు మాట్లాడుతూ నిరంతరం ఉన్నత ఫలితాలను శ్రీ చైతన్య సాధించడం జరుగుతుందన్నారు. ఇంతటి విజయాలను అందించిన కళాశాలల ఉపాధ్యాయులకు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.